సాక్షి అనంతపురం

శనివారం । 18 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.28,320

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28,320 పలికాయి.



టమాట కిలో రూ.11

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.11 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి ధర రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 34.3°/15.4°

జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష



లేపాక్షిలోని నవోదయ విద్యాలయం

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 4,556 మంది బాలురు, 3,431 మంది బాలికలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అనంతపురం జిల్లాలో 15, శ్రీసత్యసాయి జిల్లాలో 19 చొప్పున మొత్తం 34 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, కేంద్రానికి గంట ముందే హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

'సమగ్ర' ఏపీసీ బాధ్యతల స్వీకరణ



డీఈఓ ప్రసాద్‌బాబుకు బొకే అందజేస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ)గా నియమితురాలైన శైలజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందురోజే బాధ్యతలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆలస్యం కావడంతో తర్వాత రోజు విధుల్లో చేరారు. కార్యాలయానికి చేరుకున్న ఆమెను సూపరింటెండెంట్ ఇక్బాల్, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ జయరామ్, ఎఫ్ఏఓ, ఐఈ కోఆర్డినేటర్ పెద్దయ్య, ఏపీఓ నారాయణస్వామి, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు కలిసి బొకే అందజేశారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఏ విభాగం ఏయే పనులను పర్యవేక్షిస్తుందో అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారంలో విద్యాశాఖ కమిషనర్ జిల్లా పర్యటన ఉన్న నేపథ్యంలో చర్చించారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష డీపీసీ ప్రసాద్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

సేవాలాల్ ఉత్సవాలు విజయవంతం చేయాలి



అనంతపురం అర్బన్: సేవాఘడ్‌లో ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. జయంత్యుత్సవాల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల పర్యవేక్షణకు మూడు ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. సేవాఘడ్‌కు వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల. ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

❐ గుంతకల్లుకు చెందిన లీలావతి కాన్పు కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి వెళ్లింది. అక్కడ పరిస్థితి చూస్తే ఒకే మంచంపై ఇద్దరు ముగ్గురు పడుకుని ఉండటంతో ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంకు వెళ్లింది. నార్మల్ డెలివరీ అయింది కానీ.. రూ.30 వేలు బిల్లు వేయడంతో ఆ కుటుంబం విస్తుపోయింది.

❐ అనంతపురం హౌసింగ్‌బోర్డుకు చెందిన రంగనాయకులు అనే 45 ఏళ్ల వ్యక్తి ఛాతిలో నొప్పి రావడంతో ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. గుండె కవాటాలు మూసుకుపోయాయని, స్టంటు వేసి రూ.2.70 లక్షల బిల్లు వేయడంతో రంగనాయకులు హతాశులయ్యారు.

❐ ఈ రెండు సమస్యలే కాదు క్యాన్సర్, ప్రమాద బాధితుల వైద్య ఖర్చులు కూడా భారీగా ఉండడంతో జనం హడలెత్తిపోతున్నారు.





వైద్యం.. భారం

- నాలుగింటితోనే భయం
- గుండె, క్యాన్సర్ వైద్యానికి భారీగా వ్యయం
- ప్రసవాలు, ప్రమాద చికిత్స ఖర్చులూ భారమే
- ప్రైవేట్‌లో ఆరోగ్యశ్రీ సేవలకు విముఖత

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆ నాలుగు రకాల జబ్బులకు భయపడిపోతున్నారు. వైద్యం ఖరీదుతో కూడుకుని ఉండటమే ఇందుకు కారణం. గుండె, క్యాన్సర్, కాన్పులు, ప్రమాద బాధితులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. సంపన్నులు ఎలాగోలా వైద్యం చేయించుకుంటున్నారు. పేదల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. రూ.5 లక్షల్లోపు వార్షిక ఆదాయం కలిగిన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందేవి. గడిచిన ఐదేళ్లు ఉచిత వైద్యసేవలు సజావుగా అందాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో ఒడుదుడుకులు మొదలయ్యాయి. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యమందించేందుకు నిరాకరిస్తున్నారు. ఇందుకు కారణం ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడమేనని తెలుస్తోంది. విధిలేని పరిస్థితుల్లో అప్పోసప్పో చేసి ప్రైవేట్‌గా చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది.

గుండెజబ్బులతో దడ

గుండె జబ్బులు సామాన్యులను భయపెడుతున్నాయి. ఏటా 20 వేల వరకు గుండెపోటు కేసులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నమోదవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు లేవంటున్నారంటే ఇక దారుణ పరిస్థితులే. ఒక స్టంట్ వేస్తే రూ.2 లక్షల వరకు అవుతోంది. దీంతో జనం బెంబేలెత్తుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2019 నుంచి 2023 వరకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు..వ్యయం

కేటగిరీ	లబ్ధిదారులు	వ్యయం
గుండె జబ్బులు	24,022	రూ.101,63,90,918
క్యాన్సర్	35,319	రూ.72,31,89,174
ప్రమాద గాయాలు	34,224	రూ.87,65,83,851
నార్మల్ డెలివరీలు	18,318	రూ.13,85,55,520
సిజేరియన్ డెలివరీలు	17,992	రూ.24,03,41,671

క్యాన్సర్ కేసులతో ఆందోళన

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ కేసులు ఏటికేటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లు ఎక్కువ. చాలామంది హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. సర్జరీలు, కీమో థెరపీలకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

ప్రమాద బాధితులకు భరోసా లేదు

అనంతపురం జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాద కేసులు నమోదవుతున్నాయి. పాలీ ట్రామా కేసుల చికిత్సకు భారీ వ్యయం అవుతుంది. సర్వజన ఆస్పత్రిలో లోడు పెరగడంతో చెయ్యలేకపోతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు ఒక్కోసారి సర్కారు నుంచి నిధులు రావడం లేదని చేతులెత్తేస్తున్నాయి. దీంతో రోజురోజుకూ సామాన్యుల్లో ఆందోళన పెరుగుతోంది.

ఖరీదైన జబ్బులకు చిక్కే



క్యాన్సర్, రోడ్డు ప్రమాదాలు, గుండె ఆపరేషన్లు లాంటి ఖరీదైన వైద్యం చేయించుకోవాలంటే పేదలకు చిక్కులు తప్పడం లేదు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద సేవలందించడం లేదు. ఇటీవల మా బంధువుల అబ్బాయి రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాం. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసినప్పటికీ.. అదనపు ఖర్చుల కింద రూ.వేలల్లో డబ్బు వసూలు చేశారు.

– లీలావతి, టీటీపీ, గుమ్మఘట్ట మండలం

కాన్పు జరిగితే గండం గడిచినట్టే



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 55వేల వరకూ కాన్పులు (డెలివరీలు) జరుగుతున్నాయి. గడిచిన ఐదేళ్లు ఆరోగ్యశ్రీలో ఇబ్బంది లేకుండా నార్మల్, సిజేరియన్ డెలివరీలు జరిగాయి. ప్రస్తుతం పరిస్థితులు బాగోలేవు. ప్రైవేటు ఆస్పత్రులు నిధుల సమస్యతో కేసులు తీసుకోవడం లేదు. దీంతో నార్మల్ డెలివరీకి రూ.30 వేలు, సిజేరియన్‌కు రూ.50 వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది.

కిడ్నాపర్ల అరెస్ట్

- భీమవరంలో రొయ్యల వ్యాపారి అపహరణ
- అనంతపురం శివారులో కిడ్నాపర్ల పట్టివేత
- నిందితులను పట్టించిన సెల్‌ఫోన్ సిగ్నల్స్

అనంతపురం: రొయ్యల వ్యాపారి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. భీమవరంలో వ్యాపారిని బలవంతంగా కారులో ఎక్కించుకుని బెంగళూరు వైపు వెళ్తున్న కిడ్నాపర్లను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. భీమవరం మెంటేవారితోటలో నివాసం ఉంటున్న విశ్వనాధిని వెంకట సత్యనారాయణను అనే రొయ్యల వ్యాపారి గురువారం సాయంత్రం తన తల్లిదండ్రులను షిర్డీకి పంపించేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌నుంచి బయటకు వచ్చే సమయంలో ఆయన్ను హోండా సిటీ కారులో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లారు. ఇక్కడ జరిగిన సంఘటన గురించి ఆటోడ్రైవర్ల ద్వారా సమాచారం తెలుసుకున్న సత్యనారాయణ కుమారుడు భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కిడ్నాపర్ల కదలికలను పోలీసులు ట్రేస్ చేయడంతో వివిధ పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేశారు. అదే రోజు రాత్రి కిడ్నాపర్లు అనంతపురం శివారులోని పంగల్ రోడ్డు సమీపంలోని డూన్ పంజాబీ ధాబాలో గురువారం రాత్రి భోజనం చేయడానికి ఆగారు. అక్కడే పెద్ద ఎత్తున అరుపులు వినిపించాయి. స్థానికులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదే సమయంలో భీమవరం పోలీసులకు సత్యనారాయణ సెల్‌ఫోన్ సిగ్నల్ లొకేషన్ డూన్ ధాబాను చూపించడంతో వారు అనంతపురం పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో అనంతపురం ఎస్పీ వద్ద ఉంటున్న స్పెషల్ ఆపరేషన్ గ్రూపు రంగంలోకి దిగి ధాబావద్దకు చేరుకుని కిడ్నాపర్లను అరెస్ట్ చేశారు. వ్యాపార లావాదేవీలే వ్యాపారి కిడ్నాప్‌కు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. సత్యనారాయణతో పాటు నలుగురు కిడ్నాపర్లను అనంతపురం నుంచి భీమవరానికి పోలీసులు తీసుకెళ్లారు.

రేపు ఏకసభ్య కమిషన్ రాక

అనంతపురం అర్బన్: ఎస్సీల్లో ఉపకులాల వర్గీకరణపై విచారణ నిర్వహించేందుకు ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఈ నెల 19న అనంతపురం విచ్చేయనుంది. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో బసచేస్తారు. వర్గీకరణ అంశంపై ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి 20వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులతో సమావేశం, ఎస్సీ సంఘాలు, ప్రతినిధుల నుంచి వినతులు, విజ్ఞప్తులు స్వీకరిస్తారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 'పద్మ' తరహాలో 'అనంత' అవార్డులు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: గణతంత్ర వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26న పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవంపై కలెక్టర్ శుక్రవారం రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోలతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పద్మ అవార్డుల తరహాలో కొత్తగా అనంత రత్న, అనంత శ్రీ, అనంత భూషణ్, అనంత విభూషణ్ వంటి అవార్డులు అందించేలా చూడాలని ఆదేశించారు. కొత్త అవార్డుల అంశంపై పరిశీలనకు అసిస్టెంట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేయాలన్నారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

జిల్లాలో మాతాశిశు మరణాలు నివారించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్ఓ ఈబీ దేవితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ ఏడాదిలో జరిగిన నాలుగు మాతృ మరణాల కేసులకు సంబంధించి నిపుణులైన వైద్య సిబ్బందితో కూడిన కమిటీ ద్వారా విచారణ జరిపించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించడంతో పాటు ప్రసవం జరిగి ఇంటికి వెళ్లే వరకు దగ్గరుండి వైద్యసేవలు అందించాలని చెప్పారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, వైద్యులు శంషాద్‌బేగం, డేవిడ్, నవీన్ కుమార్, శ్రీనివాసులు, యుగంధర్, పాల్గొన్నారు.

మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్

ఇక నుంచి ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రతి నెలా ఒక నినాదంతో కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ నెల మూడో శనివారం 'కొత్త సంవత్సరం– పరిశుభ్రత ప్రారంభం' నినాదంతో కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. పట్టణాల్లో శానిటరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు.

యువత 'మత్తు'కు బానిస కారాదు

మత్తు, మాదకద్రవ్యాలకు యువత బానిస కారాదని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు, మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డి-అడిక్షన్ సెంటర్ క్రియాశీలంగా పనిచేయాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం ఉండే కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. మందుల దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలు ఇవ్వకుండా చూడాలన్నారు. మందుల షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, అదనపు ఎస్పీ రమణమూర్తి, ఆర్డీఓ కేశవనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



సంఘటన స్థలంలోనే పడి ఉన్న మృతదేహాలు

కళ్యాణదుర్గం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతుల్లో ఒకరు యువకుడు, మరొకరు బాలుడు ఉన్నారు. రెండు కుటుంబాల్లో తీరని విషాదఛాయలు అలుముకున్నాయి. శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన ఫరూక్ (25) తన స్నేహితుడు తాసిర్(16)తో కలిసి శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై కర్ణాటకలోని మొలకాల్మూర్‌కు బయల్దేరారు. కళ్యాణదుర్గానికి చెందిన చంద్రశేఖర్, సందీప్ హంపి నుంచి బైక్‌పై స్వస్థలానికి వస్తున్నారు. సరిగ్గా రెండు ద్విచక్రవాహనాలూ కళ్యాణదుర్గం సమీపంలోని గూబనపల్లి వద్ద వేగాన్ని అదుపు చేయలేక ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆ వెనకే గుర్తుతెలియని వాహనం ఫరూక్, తాసిర్‌పై వెళ్లడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చంద్రశేఖర్, సందీప్ స్వల్పంగా గాయపడ్డారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఫరూక్‌కు భార్య ముజీమ, ఏడాది కూతురు ఉన్నారు.

'సూపర్ స్పెషాలిటీ'ని బలోపేతం చేయాలి

- అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశం



సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు సూచనలిస్తున్న అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వర్లు

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని బలోపేతం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్ఓడీలను అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ, స్పెషాలిటీ సేవలన్నీ మొదలు కావాలన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. మొదట సర్వజనాస్పత్రిలో క్యాజువాలిటీని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు, తదితర శస్త్రచికిత్సలకు సంబంధించి ఎమర్జెన్సీ నుంచి ఆపరేషన్ థియేటర్‌కు మార్గాన్ని ఏర్పాటు చేయాలని, అత్యవసర ఆర్థో, సర్జరీ కేసులకు ఈ ఓటీలోనే శస్త్రచికిత్సలు చేయించాలన్నారు. ఓపీ కౌంటర్‌ను పరిశీలించిన ఆయన అభా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరిగా జరిగేలా చూడాలని, 25 సెల్‌ఫోన్లను కొనుగోలు చేయాలన్నారు.

హెచ్ఓడీలకు దిశానిర్దేశం

అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హెచ్ఓడీలతో అడిషనల్ డీఎంఈ సమావేశమయ్యారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని సూపర్ స్పెషాలిటీకి మార్చాలని, అక్కడే చిన్నారులకు శస్త్రచికిత్సలు మొదలుపెట్టాలన్నారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగానికి అసోసియేట్, అసిస్టెంట్, పీజీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలకు ఆరోగ్యశ్రీ, హాస్పిటల్, వైద్య కళాశాల నిధుల నుంచి వినియోగించుకోవాలన్నారు. పోర్టబుల్ వెంటిలేటర్లను కొనుగోలు చేయాలన్నారు. వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలో అందుబాటులో ఉండి, రోగులకు మెరుగైన సేవలందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, హెచ్ఓడీలు రామస్వామినాయక్, శంషాద్‌బేగం, నవీన్‌కుమార్, రవికుమార్, భాస్కర్, రామస్వామి, కార్డియాలజిస్టు సుభాష్ చంద్రబోస్, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- డీటీసీ వీర్రాజు



మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: రాబోవు ఐదేళ్ల నాటికి రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని, ఆ దిశగా వాహనదారులూ సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపరవాణా కమిషనర్ వీర్రాజు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో విపత్తులా మారిన రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సంఘటితం కావాలన్నారు. ప్రమాదంలో ఒకరు చనిపోతే యావత్తు కుటుంబం నష్టపోతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. అతివేగం, మత్తులో వాహనాలు నడపడం చేయరాదన్నారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఆర్టీఓ సురేష్‌నాయుడు మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గోల్డెన్ హవర్‌లో ఆస్పత్రికి చేరిస్తే గుడ్‌సమరియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ. 5వేలు పారితోషికం, ప్రశంసాపత్రం అందజేసి సత్కరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఆలోచించి క్షతగాత్రులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, మనోహర్ రెడ్డి, ప్రసాద్, రఘునాథ్ పాల్గొన్నారు.

మెప్మాలో రాజకీయ వేధింపులు

- ఆరుగురు ఆర్పీలకు ఉద్వాసన
- కారణం లేకుండా తొలగించడంపై మండిపాటు

రాయదుర్గం టౌన్: స్థానిక మెప్మా విభాగంలోని మహిళా ఉద్యోగులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతాపం చూపారు. రాజకీయ కక్షతో అకారణంగా వారిని ఉద్యోగాల నుంచి తొలగించి తమ అక్కసు వెళ్లగక్కారు. రాయదుర్గంలో ఇప్పటికే మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, స్టోరు డీలర్లను రాజకీయ వేధింపులతో 90 శాతం తొలగించారు. తాజాగా మెప్మాలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లను తొలగించడంపై పలువురు ఉద్యోగులు మండిపడుతున్నారు. పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో 42 మంది ఆర్పీలు పని చేస్తుండగా కొంతకాలంగా టీడీపీ నేతలు, మాజీ కౌన్సిలర్లు వారి అనుమాయులకు ఆ పోస్టులను కట్టబెట్టాలంటూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకెళ్లారు. వారి మాట వినకపోతే ఎక్కడ తమ ఉద్యోగాలు ఊడగొడతారోననే భయం మెప్మా అధికారులను వెన్నాడింది. ఫలితంగా స్థానిక టీడీపీ నేతలు సూచించిన ఆరుగురు ఆర్పీలను తొలగించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆర్పీలను తొలగించడం వివాదస్పదమైంది. 3వ వార్డుకు చెందిన ఆర్పీ పద్మావతి మాట్లాడుతూ... అకారణంగా ఆర్పీలను తొలగిస్తున్నారని, ఈ అంశంపై న్యాయపోరాటం సాగిస్తామని పేర్కొన్నారు. మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇద్దరు ఆర్పీలను తొలగించామని మిగిలిన నలుగురిని కూడా తొలగించి ఇతరులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఏ కారణాలతో వారిని తొలగిస్తున్నారన్న విలేకరుల ప్రశ్నకు సమాధానం దాటవేశారు.

విస్తీర్ణం తక్కువ.. పంటలు ఎక్కువ

మనసుంటే మార్గం ఉంటుందని నాడు పెద్దలు అన్నారు. ఆశయం కోసం నిరంతరం కృషి చేసినప్పుడు అనుకున్నది సాకారమవుతుందని నిరూపించారు నేటి రైతులు. డబ్బు లేదని చింతించకుండా ఉన్న వనరులతో తక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలిచారు.





ఎం.చెర్లోపల్లిలో పామాల్ల రామకృష్ణ పొలంలోని 5 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసిన కూరగాయలు, ఘన, ద్రవ జీవామృతాలను తయారు చేసుకుంటున్న రైతులు

- సెంటు నుంచి ఐదు సెంట్ల స్థలంలో ఆకు, కూరగాయల సాగు
- ఇంటి ఆవరణ, ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్స్
- స్వయం సహాయక, గ్రామ సంఘాల సమన్వయంతో ఏర్పాటు

రాప్తాడు: మండలంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రయోగాత్మకంగా చేపట్టిన తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటల సాగు విజయవంతమైంది. ఏడాది పొడవునా రాబడి ఉండేలా మల్టీ లేయర్ విధానంతో చేపట్టిన పంటల సాగు ఆశించిన ఫలితాలను ఇస్తుండడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాప్తాడు మండలంలోని పలువురు రైతులు తమ పొలాలు, ఇంటి ఆవరణలో 365 కిచెన్ గార్డెన్స్ కాన్సెప్ట్, ఏటీఎం (వ్యవసాయ–పర్యావరణ పరివర్తన నమూనా)ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విధానం ద్వారా నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయలను పండిస్తూ ప్రజారోగ్యానికి బాటలు వేస్తున్నారు.

సెంటు నుంచి 5 సెంట్ల వరకూ..

రాప్తాడు మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 200 వరకు కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఏడాదిలో 365 రోజులూ ఆదాయం ఉండేలా వీటికి ప్రకృతి వ్యవసాయం విభాగం వారు రూపకల్పన చేయడంతో పాటు ఆ దిశగా రైతులను, గృహిణిలను ప్రోత్సహిస్తోంది. రైతుల పొలాల్లో ఓ సెంటు మొదలు ఐదు సెంట్ల వరకు, ఇంటి ఆవరణలు, మిద్దెపై వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలపై విస్తృత చైతన్యం కల్పిస్తున్నారు. ఇందుకు సంబంధించిన విత్తనాలను ప్రకృతి వ్యవసాయ విభాగం వారే సమకూరుస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల సహకారంతో ఈ కార్యాచరణను విజయవంతంగా అమలు చేస్తున్నారు. దీంతో చాలా మంది తమ ఇళ్ల ఆవరణలో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అలాగే మిద్దెలపై టెర్రస్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. సాగులో ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం సేంద్రీయ ఎరువులనే వాడుతుండడం విశేషం. పొలం గట్టు చివర ఉన్న మట్టిని లేదా, అటవీ ప్రాంతం నుంచి కానీ, పుట్ట మన్నును కాని సేకరించి టెర్రస్, కిచెన్ గార్డెన్‌కు వాడుతున్నారు.

5 సెంట్లలో ఐదారు రకాల పంటలు



నాకున్న పొలంలో నుంచి 5 సెంట్లలో బీట్‌రూట్, క్యారెట్, బెండ, మిరప, టమాట, ఆవాలు, కొత్తిమీర, ఆకుకూరలతో పాటు వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నా. వీటికి ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం లేదు. ప్రకృతి సేద్యం అధికారుల సూచన మేరకు పశువుల పేడ, జీవామృతం వాడుతున్నా. పంటల దిగుబడి ఎంతో నాణ్యతగా ఉంటున్నాయి. నెల పొడువునా ఇంటి అవసరాలు తీరడంతో పాటు ఇరుగు పొరుగు వారికి కూడా ఇస్తున్నాం.

– పామాల్ల రామకృష్ణ, రైతు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం



మారిన మన ఆహారపు అలవాట్లే అనారోగ్యానికి కారణమని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాం. దీంతో ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనతో ఇంటి వద్దనే ఖాళీగా ఉన్న 2 సెంట్లలో 15 రకాల కూరగాయలు, 10 రకాల ఆకు కూరలను సొంతంగా సాగు చేస్తున్నా. పెట్టుబడి తక్కువ. సేంద్రీయ ఎరువులు వాడుతున్నా. ఈ పంటను ఆహారంగా తీసుకున్న తర్వాత మా ఇంట్లో అందరమూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం. పండించిన కూరగాయలు, ఆకు కూరలను మా ఇంటి అవసరాలకు వాడుకుని మిగిలిన వాటిని చుట్టుపక్కల వారికి ఇస్తున్నాం.

– రాజేశ్వరి, మహిళా రైతు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

పెరటి తోటలను ప్రోత్సహిస్తున్నాం



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. పురుగు మందులు, రసాయనిక మందులు, ఎరువులు వాడకుండా కేవలం ద్రవ, ఘన జీవామృతాలనే వాడేలా అవగాహన కల్పిస్తున్నాం. రాప్తాడు మండలంలో ఇప్పటికే 200లకు పైగా కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేశాం. రైతులు కూడా ముందుకు వస్తున్నారు. వారికి అవగాహన కల్పిస్తూ విత్తనాలను సమకూరుస్తున్నాం.

– భూపాల్ రెడ్డి, ఎంటీఎల్, ప్రకృతి వ్యవసాయం, రాప్తాడు

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



మంజునాథ యాదవ్ (ఫైల్)

పెద్దపప్పూరు: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన గంగరాజు, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు నారాయణస్వామి ఇటీవల తన జేఎల్ఎం ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయంలో తండ్రికి చేదోడుగా నిలిచాడు. ఐచర్ వాహన డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రెండో కుమారుడు మంజునాథయాదవ్ (23) కొంత కాలంగా తనకు పల్సర్–160 బైక్ కొనివ్వాలని తండ్రిని అడుగుతూ వచ్చాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, కొంత కాలం ఆగితే బైక్ కొనిస్తామని తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. గురువారం మరోసారి బైక్ కొనుగోలు విషయంగా తల్లిదండ్రులను మంజునాథయాదవ్ ఒత్తిడి చేశాడు. వారు మరికొంత కాలం సమయం కావాలని తెలపడంతో క్షణికావేశానికి లోనైన మంజునాథయాదవ్ అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో తోటి మిత్రుల సాయంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం తెల్లవారుజామున గంగరాజు తన మామిడి తోటకు నీళ్లు పెట్టడానికి వెళ్లిన సమయంలో అక్కడ మామిడి చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని 'ఎంత పని చేశావయ్యా?' అంటూ బోరున విలపించారు. ఘటనపై ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రహదారిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

బ్రహ్మసముద్రం: గ్రామానికి వెళ్లే రహదారిని స్థానిక టీడీపీ నేతలు మూసేసి అడ్డుగా వేసిన ముళ్ల కంపలను శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. వివరాలు... బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి పంచాయతీలోని ముద్దలాపురం గ్రామం నుంచి రాయలప్పదొడ్డి గ్రామానికి వెళ్లే రహదారిని ఐదు నెలల క్రితం స్థానిక టీడీపీ నేతలు మూసేశారు. ముళ్ల కంపలు అడ్డుగా వేసి ఆ మార్గంలో రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. కొన్నేళ్లుగా ఆ మార్గంలోనే ప్రయాణిస్తున్న ప్రజలు, విద్యార్థులు ప్రస్తుతం నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో సమస్యను పరిష్కరించాలంటూ రాయలప్పదొడ్డి గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. ముద్దలాపురం నుంచి రాయలప్పదొడ్డి గ్రామానికి వెళ్లే దారిని పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న మేరకు రహదారికి హద్దు చూపించే ప్రయత్నం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, సర్వేయర్ సుకర్ణ, వీఆర్వోలు లక్ష్మన్న, హనుమేష్, ముద్దలాపురం గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో దారుణం

- వివాహేతర సంబంధం వద్దని వారించిన భార్యను హతమార్చిన భర్త





పుష్పావతి (ఫైల్), నిందితుడు వెంకటేశ్వర రెడ్డి

తాడిపత్రి టౌన్: వివాహేతర సంబంధం అనర్థాలకు దారి తీస్తుందని భార్య నెత్తి నోరు బాదుకున్నా.. వినలేదు. పైగా పరాయి మహిళపై భర్తకు మక్కువ మరింత పెరిగింది. కొన్ని రోజులు దూరంగా ఉంటే మార్పు వస్తుందనుకుంది. ఆశించిన ఫలితం దక్కలేదు. చివరకు తన జల్సాల కోసం ఆస్తిని అమ్మకానికి పెడితే వద్దని వారించిన భార్యను వేటకొడవలితో నరికి హతమార్చాడు.

14 ఏళ్ల బంధాన్ని పరిహసించి...

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లికి చెందిన పుష్పావతి(37)కి 14 ఏళ్ల క్రితం పుట్లూరు మండలం చిప్పిడి వెంగన్నపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా గ్రామంలోని మరో మహిళతో వెంకటేశ్వరరెడ్డి వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న పుష్పావతి తన భర్తను వారించింది. వివాహేతర సంబంధాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలను వివరించింది. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో తరచూ కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటుండంతో కొంత కాలం తాను దూరంగా ఉంటేనైనా భర్తలో మార్పు వస్తుందని భావించిన ఆమె నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది.

ఆస్తిని అమ్మకానికి పెట్టి

పరాయి మహిళ మోజులో ఉన్న వెంకటేశ్వరరెడ్డి తన కుటుంబాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో జులాయిగా మారి తన పేరున ఉన్న స్థిరాస్తులను అమ్ముకుని జల్సాలు చేయసాగాడు. చివరగా మిగిలిన రెండు ఎకరాల భూమిని అమ్మేందుకు సిద్ధపడడంతో విషయం తెలుసుకున్న పుష్పావతి అప్రమత్తమైంది. భూమి అమ్మకాన్ని అడ్డుకుంది. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశాడు. శుక్రవారం ఉదయం తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో ఉన్న ఓ లాడ్జీలో పెద్ద మనుషులను సమావేశపరిచాడు. గదిలోపల పెద్ద మనుషులు మాట్లాడుకుంటుండగా పుష్పావతి బయట కూర్చొని ఉంది. అనంతరం గదిలోకి వెళ్లిన భార్యను 'పొలాన్ని అమ్ముతాను సంతకం చేస్తావా? లేదా?' అంటూ వెంకటేశ్వర రెడ్డి బెదిరింపు ధోరణితో అడిగాడు. ఆ సమయంలో ఆమె ససేమిరా అనడంతో అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న వేటకొడవలితో నరికి పారిపోయాడు. అక్కడున్న వారు వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలోనే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వెంకటేశ్వరరెడ్డి కోసం గాలింపు చేపట్టారు.

అధికారం కోసం నిరుద్యోగులను దగా చేస్తారా?

- జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఎక్కడ?
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్



రాష్ట్ర మహాసభల లోగో, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాఫర్, తదితరులు

అనంతపురం అర్బన్: అధికారం కోసం నిరుద్యోగులను దగా చేయడం సరికాదని కూటమి పెద్దలకు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ హితవు పలికారు. తాము అధికారంలోకి వస్తే ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామంటూ ఎన్నికల సమయంలో లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే 17వ తేదీ వచ్చినా జాబ్ క్యాలెండర్ విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడం చూస్తుంటే నిరుద్యోగులను మోసం చేసే దిశగా కూటమి సర్కార్ అడుగులు వేస్తోందని భావించాల్సి వస్తోందన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కోట్రేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల లోగోను, పోస్టర్లను వారు విడుదల చేసి, మాట్లాడారు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకూ శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని మండిపడ్డారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. వీటన్నిటింపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుల శ్రీనివాస్, ధను, కుళ్లాయిస్వామి, దేవ వంశీ, నవీన్ బాబు, నాగరాజు, మొయిన్ పాల్గొన్నారు.

షీప్ సొసైటీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో రెండో విడతగా శనివారం నిర్వహించనున్న గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో షీప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మితో కలసి ఎన్నికల అధికారులుగా ఉన్న పశువుల డాక్టర్లతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తొలివిడతగా 36 సంఘాలకు గాను ఈ నెల 7న 27 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించామన్నారు. వివిధ కారణాలతో ఏడు సొసైటీల నిలిచిపోయాయన్నారు. రెండో విడతగా మరో 36 సంఘాలకు, మూడో విడత కింద ఈనెల 25న 35 సంఘాలకు, చివరి విడతగా ఫిబ్రవరి 5న 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల మేరకు ఎన్నికలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా తలొగ్గరాదన్నారు.

గ్రామానికి చేరిన తమ్మయ్యదొడ్డి వాసులు



గ్రామ పొలిమేరలో వేసుకున్న గుడారాలు

కుందుర్పి: మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ్మయ్యదొడ్డి గ్రామస్తులు పూర్వీకుల ఆచారాన్ని పాటిస్తూ గురువారం సాయంత్రం గ్రామాన్ని వీడి రాత్రంతా పొలిమేరలో గడిపారు. గ్రామంలోకి ఇతరులు ఎవరూ ప్రవేశించకుండా చుట్టూ ముళ్లకంచె వేశారు. దాదాపు 60 కుటుంబాల వారు పిల్లపాపలు,పెంపుడు జంతువులతో ఊరొదిలారు. శుక్రవారం సాయంత్రం గ్రామ శాంతి అనంతరం ఇళ్లకు చేరుకున్నారు. ఐదేళ్లకోసారి ఈ ఆచారాన్ని పాటిస్తుంటామని గ్రామానికి చెందిన గొర్ల పాలయ్య, తమ్మయ్య, బోరప్ప, చిత్తయ్య తదితరులు తెలిపారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ సేవలపై ఆరా



సెంట్రల్ టీంతో వైద్య సిబ్బంది

శింగనమల: గ్రామ సచివాలయాల పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందిస్తున్న సేవలపై కేంద్రం నుంచి వచ్చిన జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సభ్యులు ఆరా తీశారు. శుక్రవారం నేరుగా శింగనమల విలేజ్ క్లినిక్‌ను సెంట్రల్ టీం సభ్యులు డాక్టర్ సవిత, డాక్టర్ అరవింద్ పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందితో ఆరా తీశారు.

నకిలీ విలేకరుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్: పాత్రికేయుల ముసుగులో దందాలు, వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ శివగంగాధరరెడ్డి శుక్రవారం వెల్లడించారు. తాడిపత్రిలోని నందలపాడుకు చెందిన యర్రగుంట్ల చిన్నబాబు, చిలమకూరు తిమ్మదాసు గతంలో పలు ధాబాలలో వంట మాస్టర్లుగా పనిచేసేవారు. మద్యానికి బానిసలుగా మారడంతో యజమానులు వారిని పనిలో నుంచి తొలగిస్తూ వచ్చారు. దీంతో సులువుగా డబ్బు సంపాదించి జల్సా చేయాలని భావించిన వారు... ఓ మీడియా సంస్థకు చెందిన ఐడీ కార్డులు తామే సృష్టించుకుని పాత్రికేయులుగా చలామణి అవుతూ వచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 16న సాయంత్రం తాడిపత్రి శివారున చుక్కలూరు రోడ్డులో ఉన్న బొరుగుల బట్టికి వెళ్లి యజమాని మల్లికార్జున రెడ్డిని బెదిరించారు. తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే వ్యాపారాన్ని దెబ్బతీసేలా కథనాలను ప్రసారం చేస్తామంటూ హెచ్చరించారు. దీంతో భయపడిన మల్లికార్జునరెడ్డి రూ.వెయ్యి చెల్లించాడు. అనంతరం ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నందలపాడు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద వెళుతున్న చిన్నబాబు, తిమ్మదాసును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారి వద్ద నుంచి నకిలీ ఐడీ కార్డులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చీటింగ్ కేసులో పాత్రికేయుడికి రిమాండ్

గుత్తి: చీటింగ్ కేసులో పట్టుబడిన డోన్‌కు చెందిన విజయ్‌కుమార్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గుత్తి ఎస్ఐ సురేష్ తెలిపిన మేరకు... 2022లో గుత్తికి చెందిన మైనుద్దీన్‌కు చుక్కల భూములకు ఎన్‌ఓసీ (క్రమబద్ధీకరణ) ఇప్పిస్తామంటూ డోన్‌కు చెందిన విజయకుమార్ (విలేకరి), అనంతపురానికి చెందిన కేశప్ప (విలేకరి) నమ్మబలికి రూ. 6 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత ఎన్ఓసీ ఇప్పించకుండా మిన్నకుండిపోయారు. దీనిపై పలుమార్లు మైనుద్దీన్ అడిగినా వారు పట్టించుకోలేదు. డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో జరిగిన మోసాన్ని వివరిస్తూ బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు విజయకుమార్, కేశప్పపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విజయకుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువకుడి మృతదేహం లభ్యం



సాయిశశాంక్ రెడ్డి (ఫైల్)

అనంతపురం: నగర శివారులోని సుఖ్‌దేవ్ నగర్ వద్ద గత బుధవారం హెచ్చెల్సీలో గల్లంతైన యువకుడు కాకర్ల సాయిశశాంక్‌రెడ్డి (28) మృతి చెందాడు. ఫోర్త్ టౌన్ పీఎస్ పరిధిలో కాలువలో శుక్రవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన కాకర్ల శ్రీధర్‌రెడ్డి, మంజుల దంపతుల పెద్ద కుమారుడు సాయిశశాంక్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశారు. ఈ నెల 15న తన స్నేహితులు కౌశిక్, శ్రీకాంత్‌రెడ్డితో కలసి సుఖ్‌దేవ్‌నగర్ వద్ద ఉన్న హెచ్చెల్సీ వద్దకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తూ కాలువలో పడి గల్లంతయ్యాడు. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనాస్థలానికి 100 మీటర్ల దూరంలో సాయంత్రం లభ్యమైన మృతదేహాన్ని ఎస్ఐ రాంప్రసాద్ వెలికి తీయించి సర్వజనాస్పత్రికి తరలించారు.

తల్లిదండ్రుల వద్దకు పిల్లలను చేర్చిన పోలీసులు



చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పామిడి: తప్పిపోయిన పిల్లలను సకాలంలో గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు పామిడి పోలీసులు చేర్చారు. వివరాలు.. పెద్దవడుగూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన అంగన్‌వాడీ టీచర్ విజయశ్రీ,, ఖాసింవలి దంపతులకు ఆరేళ్ల వయసున్న చిన్న మహమ్మద్ తబ్రేజ్, నాలుగేళ్ల వయసున్న కుమార్తె మమ్మీ, 18 నెలల వయసున్న కుమార్తె షాన్వీ ఉన్నారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం పార్క్‌కు వెళదామని పిల్లలు మారాం చేశారు. దీంతో పిల్లలను పిలుచుకుని అనంతపురంలోని సెంట్రల్ పార్క్‌కు వెళ్లేందుకు విజయశ్రీ సిద్ధమైంది. విషయం తెలుసుకున్న అదే కాలనీకి చెందిన 13 ఏళ్ల లోపు వయసున్న బాలాజీ, సూరిబాబు, శివరాం కూడా తామూ వస్తామని పట్టుబట్టారు. దీంతో అందరినీ తన స్కూటీపై ఎక్కించుకుని శుక్రవారం ఉదయం పది గంటలకు బయలుదేరిన ఆమె.. .మార్గ మధ్యంలో 11 గంటల సమయంలో గార్లదిన్నె మండలం కల్లూరు క్రాస్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో గుత్తి నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న ఓ గుర్తు తెలియని కారును ఆపి సాయం అర్థించింది. కారు డ్రైవర్ అంగీకరించడంతో తన కుమారుడు చిన్న మహమ్మద్ తబ్రేజ్, కుమార్తె మమ్మీతో పాటు బాలాజీ, సూరిబాబును కారులో ఎక్కించి, వారిని అనంతపురంలో బస్టాండ్ వద్ద వదలాలని తెలిపి, స్కూటీపై– చిన్న కుమార్తె, శివరాంతో కలసి అనుసరించింది. అనంతపురానికి చేరుకున్న అనంతరం తాను చెప్పిన ప్రాంతంలో పిల్లలు కనిపించకపోవడంతో కంగారుకు గురైన ఆమె వెంటనే నలుగురు పిల్లలు కనిపించడం లేదంటూ గార్లదిన్నె పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా విషయాన్ని వెంటనే అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని పీఎస్‌ల పరిధిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం పామిడిలోని వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సీఐ యుగంధర్ ఓ ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు పిల్లలను గుర్తించి, ఆటోను ఆపి ఆరా తీశారు. తప్పిపోయిన పిల్లలు వారేనని గుర్తించి వెంటనే స్టేషన్‌కు పిలుచుకెళ్లారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు పామిడి పీఎస్‌కు చేరుకున్నారు. కౌన్సిలింగ్ అనంతరం పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. సురక్షితంగా పిల్లలను అప్పగించిన పోలీసులకు ఈ సందర్భంగా తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



సైనిక సంక్షేమ శాఖ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్: సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వి నూత్న, డీఆర్ఓ ఎ.మలోల, సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప పాల్గొన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు అదనపు బాధ్యతలు

అనంతపురం కార్పొరేషన్: అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అదనపు బాధ్యతలు అప్పగించారు. నెల రోజుల శిక్షణలో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తించనున్నారు. ప్రతి ఫైల్‌ను స్క్రూట్నీ చేసి, తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ నగరపాలక సంస్థకు వచ్చారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

అనంతపురం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు మెంబర్ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య బృందం ఉచిత పరీక్షలతో పాటూ మందులను కూడా ఉచితంగానే అందిస్తారన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్టాఫ్‌నర్సుల సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న లత

అనంతపురం కార్పొరేషన్: స్టాఫ్‌నర్సుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ స్టాఫ్‌నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లత కోరారు. శుక్రవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. స్టాఫ్‌నర్సులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. స్టాఫ్‌నర్సు పోస్టులను కేటాయించాలన్నారు. అదేవిధంగా సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సులకు పనిభారం అధికంగా ఉందని తెలిపారు. స్టాఫ్‌నర్సులకు కనీస సౌకర్యాలైన బాత్‌రూంలు, డ్రెస్సింగ్ రూంలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించారు. తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్థానిక కొత్తూరు జూనియర్ కాలేజ్ వేదికగా ఆదివారం ఉదయం 10:30 గంటలకు ప్రముఖ విమర్శకులు రాజారాం రచించిన పూలమీద వాలిన తేనెటీగ పుస్తకావిష్కరణ ఉంటుందని స్పందన అనంత కవుల వేదిక ప్రతినిధి చం.శాస్త్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ రచయితలు డాక్టర్ శాంతి నారాయణ, ప్రముఖ విమర్శకులు లక్ష్మీనరసయ్య చేతుల మీదుగా సాగే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సాహితీ అభిమానులందరూ పాల్గొనాలని కోరారు.

పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీమ్‌బాషా

ఆత్మకూరు: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి. పనులు త్వరగా పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు అందుతాయని డ్వామా పీడీ సలీమ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మదిగుబ్బ, బి.యాలేరు గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. కొలతలు కచ్చితంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ప్రస్తుతం మండలానికి కేటాయించిన పనులు త్వరగా పూర్తి చేస్తే మండలానికి మరిన్ని పనులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గోకులం షెడ్లను వెంటనే పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏపీఓ సుజాత, ఈసీ భాస్కర్ ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


ప్యాచ్.. అంతా తూచ్



రామగిరి మండలం పీఆర్ కొట్టాల నుంచి ఎగువపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి ఇలా..

'సంక్రాంతి నాటికి అద్దాల్లాంటి రోడ్లు నిర్మిస్తాం. ఈ దఫా సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చేవాళ్లు ఇక్కడున్న రోడ్లను చూసి ఆశ్చర్యపోయేలా చేస్తాం' ఇది సీఎం చంద్రబాబు చెప్పిన మాట. కానీ అవన్నీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదు. రాప్తాడు నియోజకవర్గంలో దాదాపుగా 1,500 కి.మీ తారు రోడ్లు ఉండగా వాటిలో 70 శాతం రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. కానీ కూటమి ప్రభుత్వం ఇక్కడ 60 శాతం మేర రోడ్ల మరమ్మతులు చేసినట్లు చెబుతున్నా.. వాటిని కూడా నాసిరకంగా వేశారు. పండుగకు ఇక్కడికి వచ్చిన వాళ్లు రోడ్లను ప్రత్యక్షంగా చూసి అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని మండిపడుతున్నారు.

- సంక్రాంతి హామీ హుళక్కే
- తూతూమంత్రంగా ప్యాచ్‌వర్క్‌లు
- 80 శాతం రోడ్లకు గుంతలు
- ప్రజలకు తప్పని అవస్థలు
- ఇదీ రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి



రాప్తాడు: నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఘోరంగా తయారైంది. రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టారు. ఈ పనులు దక్కించుకున్న కూటమి కాంట్రాక్టర్లు సైతం సొమ్ము మిగిలేలా పనులు చేపట్టారు. రాప్తాడు మండలం రామినేపల్లి నుంచి ఎం.బండమీదపల్లి, సాక్షి కార్యాలయం నుంచి కక్కలపల్లి మీదుగా కనగానపల్లి మండల కేంద్రం వరకూ తూతూమంత్రంగా పనులు చేయడంతో మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. రామగిరి మండలంలో ఎగువపల్లి నుంచి కొత్తగ్యాదికుంటకు వెళ్లే రహదారి, గ్యాదికుంట నుంచి కనగానపల్లి మండలంలోని సోమరవాండ్ల పల్లికి వెళ్లే మార్గంలో చేపట్టిన ప్యాచ్‌వర్క్‌లు కూడా అధ్వానంగా ఉన్నాయి. ధర్మవరం నుంచి మామిళ్లపల్లి, కనగానపల్లి మీదుగా కళ్యాణదుర్గం వరకూ రోడ్లకు మరమ్మతులు చేయగా.. అప్పుడే గుంతలు ఏర్పడ్డాయి. ఆత్మకూరు నుంచి ముట్టాల వరకు (4 కిలోమీటర్లు), ఆత్మకూరు నుంచి సిద్దాపురం వరకు (3 కిలోమీటర్లు) నాసిరకంగా పనులు చేశారు. ఇక అనంతపురం రూరల్ మండలంలో కూడా చేపట్టిన ప్యాచ్ వర్క్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లు మరో నెల కూడా ఉంటాయనే నమ్మకం లేదు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వాహనాదారులు కిందపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లాలు. గొరిదిడ్ల నుంచి వేపచెర్లకు వెళ్లే 5 కిలోమీటర్ల రోడ్డు వర్షాలకు దెబ్బతింది. రామగిరి మండలంలో ఎగువపల్లి నుంచి పీఆర్ కొట్టాలకు వెళ్లే 7 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా లేదు. ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత గ్రామమైన వెంకటాపురంకు 5 కిలోమీటర్ల దూరంలోనే ఈ గ్రామం ఉంది. ఎమ్మెల్యే గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలోనే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే.. మిగతా గ్రామాల రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అలాగే పీఆర్ కొట్టాల నుంచి గ్యాదికుంట వెళ్లే రోడ్డు ఘోరంగా మారింది. వీటన్నింటిని అసలు పట్టించుకోకుండా రోడ్ల మరమ్మతులు చేశామని కూటమి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. వాస్తవంగా రోడ్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగలేదని ప్రజలకే తెలుసు.

రోడ్లన్నీ గుంతలమయం



కూటమి ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతలమయంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురం నుంచి కనగానపల్లి వరకు ప్యాచ్‌వర్క్ చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గోతులమయం కావడం గమనార్హం. నెల రోజులకే తార పూర్తిగా తొలగిపోయింది. మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ఎంతలా నాణ్యత ప్రమాణాలు పాటించారో ప్యాచ్‌వర్క్‌లను చూస్తే అర్థమవుతుంది.

– గవ్వల నల్లప్ప, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

వెంటనే బాగు చేయాలి



నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. మా రామగిరి మండలంలో రోడ్ల గురించి చెప్పాల్సిన పని లేదు. కర్ణాటక రాష్ట్రం ఎగువపల్లి నుంచి పీఆర్ కొట్టాలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంక్రాంతి నాటికి రోడ్లు వేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. హామీని నెరవేర్చడంతో చంద్రబాబు విఫలమయ్యారు.

– సంపత్ కుమార్, పీఆర్ కొట్టాల, వైఎస్ ఎంపీపీ, రామగిరి మండలం

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ధ్వజమెత్తారు. ఈనెల 24 నుంచి 26 వరకు ఏలూరు జిల్లా నూజివీడులో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళా మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాజకీయ శిక్షణ తరగతుల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే విద్యార్థులకు అవి చేస్తాం.. ఇవి చేస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ గద్దెనెక్కి 7 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. తల్లికి వందనం పథకానికి పంగనామం పెట్టారన్నారు. రాష్ట్రంలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులు, కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులు 10 లక్షల మందికి పైగా సర్టిఫికెట్లు రాక ఉద్యోగాలకు వెళ్లలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 3,580 కోట్లు ఉంటే సంక్రాంతి కానుకగా రూ.788 కోట్లు మాత్రమే ప్రకటిస్తే మిగతా డబ్బులు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. తక్షణమే పూర్తి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా ఆఫీస్ బేరర్స్ వెంకట్ నాయక్, వంశీ, మంజునాథ్, నగర కార్యదర్శి ఉమా మహేష్, నగర కోశాధికారి నాని, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్ పాల్గొన్నారు.

రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టాలి



50వ డివిజన్‌లో ఏర్పడిన గుంతలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం 50వ డివిజన్ కార్పొరేటర్ గురుశేఖర్ బాబు డివిజన్‌లోని సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మేయర్ వసీం ఆ డివిజన్‌లో పర్యటించారు. రోడ్లు, కాలువలకు గుంతలు ఏర్పడటంపై సంబంధిత అమినిటీ, ఇంజినీర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చూడాలని ఆదేశించారు. దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు సైతం ప్లాస్టిక్ నియంత్రణకు పాటుపడాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఈఈ రాధాకృష్ణ, డీఈ నరసింహం, ఏఈ రాజశేఖర్ రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా ఉంటాం

అనంతపురం కార్పొరేషన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అమినిటీ కార్యదర్శి బాబు చిత్రపటానికి నగరపాలక సంస్థలో శుక్రవారం మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న నివాళులర్పించారు. చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ మల్లికార్జున రెడ్డి, కార్పొరేటర్లు కమల్ భూషణ్, అబూసలేహ, సంపంగి రామాంజనేయులు, శేఖర్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



అలంకరణలో త్యాగరాజ విగ్రహం

అనంతపురం కల్చరల్: సంగీత వాగ్గేయకారుడు త్యాగరాజ ఆరాధనా ఉత్సవాలు శనివారం జరగనున్నాయి. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనంత వాసులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తడానికి పలు ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులు నగరానికి విచ్చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఏకైక త్యాగరాజ స్వామి ఆలయ ప్రతిష్ఠ వెనుక ఆసక్తికర కథ వినిపిస్తుంది. ముప్పై ఏళ్ల కిందట నగరంలోని సంగీత కళాకారులు త్యాగరాజ చిత్రపటంతో వాగ్గేయకార సంప్రదాయంలో నగరోత్సవం చేస్తూ సంకీర్తనలు ఆలపించేవారు. అప్పటికి జిల్లాలో ఎక్కడా త్యాగరాజ స్వామి ఆలయం ఉండేది కాదు. ద్విభాషా పండితుడు మొదలి బాలవిశ్వనాథ శర్మ, సంగీత విదుషీమణి రామరత్నమ్మ దంపతుల కృషితో 1992లో మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ప్రాంగణంలో త్యాగయ్యకు ఓ ఆలయం ఏర్పాటు చేశారు. పెనుశిల క్షేత్రం నుంచి భగవతి విజయేశ్వరీ మాతాజీ చేతుల మీదుగా త్యాగయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. నాటి నుంచి ఆలయంలో క్రమం తప్పకుండా సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నారు.

పంచరత్న గానసేవలు

త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ప్రతి ఏటికి భిన్నంగా ఈసారి రెండు చోట్ల ఘనంగా జరగనున్నాయి. తపోవనంలోని శ్రీక్షేత్రంలో జ్వాలాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు పంచరత్నల కీర్తనల గోష్ఠి, గానం ఉంటాయి. అలాగే మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ప్రాంగణంలోని త్యాగరాజ స్వామి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. శ్రీవిజయవాణి సంగీత కళానిలయం నిర్వాహకులు మొదలి మురళీకృష్ణ నేతృత్వంలో త్యాగరాజ సంకీర్తనలతో ఉదయం త్యాగరాజస్వామి కృతులతో అలరించనున్నారు. ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలతో పాటూ పలువురు సంగీత కళాకారులతో సామూహిక పంచరత్న గాన సేవలు జరుగనున్నాయి. సాయంత్రం సంగీత విభావరిలో స్థానిక విద్వాంసులతో పాటూ కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ జరుగుతుంది. బెంగళూరు నుంచి విచ్చేసే మధువంతి విజయ గణేష్, సుమేధ విజయ గణేష్ గాత్ర కచేరీ సాగుతుంది.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: ప్రజా సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశం అధికారులు మొక్కుబడిగానే నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఇక సమావేశానికి వచ్చిన అధికారులు కూడా కొందరు మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశంలో పాల్గొన్న అధికారులు కూడా తూతూమంత్రంగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ భాగ్యమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజాప్రతినిధులకు సరైన గౌరవాన్ని ఇవ్వాలన్నారు. గ్రామాల్లో కొందరు అధికారులు ప్రొటోకాల్ సరిగా పాటించటం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధిహామీ, పంచాయతీ బిల్లులు చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా సాగుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ.వీ.ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో పలువురికి గాయాలు

రాప్తాడు రూరల్: రోడ్డు పక్కన నిలిపి ఉన్న భారీ వాహనాన్ని ఆటో, బొలెరో వాహనాలు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. వివరాలు.. శుక్రవారం అనంతపురం నుంచి గార్లదిన్నె వైపుగా వెళుతున్న కాంక్రీట్ మిక్సింగ్ వాహనాన్ని సోములదొడ్డి శివారులోని నారాయణ కళాశాల ఎదురుగా రోడ్డు పక్కన డ్రైవర్ ఆపాడు. అదే సయయంలో గార్లదిన్నె వైపుగా వెళ్తున్న ఆటో వెనుక వైపు నుంచి ఢీ కొంది. ఆ వెనుకే వస్తున్న మరో బొలేరో లగేజీ వాహన డ్రైవర్ ఆటోను తప్పించబోయి కాంక్రీట్ మిక్సింగ్‌ను తరలించే వాహనాన్ని బలంగా ఢీ కొన్నాడు. ఘటనలో సీజ్ చేసిన బియ్యాన్ని బొలెరో వాహనంలో గుంతకల్లులోని గోదాముకు తరలిస్తున్న అనంతపురం రెండో పట్టణ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణనాయక్ తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవరు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన వ్యక్తి, పాములాయికి గ్రామానికి చెందిన మరో మహిళ గాయపడ్డారు. సమాచారం అందుకున్న రూరల్ పీఎస్ ఎస్ఐ రాంబాబు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 పాస్, ఇంటర్ మీడియట్, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతకు బెంగళూరులో 35 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల్లోపు వయస్సున్న వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్ కోర్సులు, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, లైఫ్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ తర్వాత 100 శాతం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు హరిప్రసాద్ =9000487423 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. శుక్రవారం మండలంలోని గోవిందపల్లి, జంతలూరు గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగు గుంటలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు ప్రబలకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ సాల్మాన్, సీహెచ్ఓ మోహన్, మద్దయ్య, శ్రీధర్‌మూర్తి పాల్గొన్నారు.

'ఉమ్రా యాత్ర పవిత్రమైనది'



ఉమ్రా యాత్రికులతో మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కల్చరల్: నగరంలోని చాందిని మసీదు శుక్రవారం రాత్రి ఉమ్రాయాత్రికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి ఉమ్రాయాత్రికులతో కలిసి ఉమ్రా యాత్ర విజయవంతంగా సాగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్రా యాత్ర అత్యంత పవిత్రమైనదని ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ప్రశాంతంగా సాగిపోతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఉమ్రా యాత్రికులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, పార్టీ నాయకులు వెన్నం శివారెడ్డి, షేక్షా, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



పూజలందుకున్న సిద్ధి వినాయకుడు

అనంతపురం కల్చరల్: సంకష్టహర చతుర్థి వేడుకలు శుక్రవారం ఆలయాల్లో వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వినాయకుడి ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక ఎస్కేయూ రోడ్డులోని లేపాక్షినగర్ వద్ద సిద్ధి వినాయక ఆలయంలో పెద్ద ఎత్తున సంకష్టహర పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శర్మ నేతృత్వంలో వినాయకుడికి అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. వందలాది మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. అదేవిధంగా హెచ్చెల్సీ కెనాల్ వద్ద ఉన్న నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో సంకష్టహర వినాయకుడు అలంకార సేవల్లో పూజలందుకున్నాడు. కార్పొరేటర్ గురు శేఖరబాబు నేతృత్వంలో తీర్థప్రసాద వినియోగం జరిగింది.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ: గ్రామాల్లో పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక పశుసంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20 నుంచి 31 వరకు 12 రోజుల పాటు ప్రతి మండలంలో రోజూ రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. పశువైద్య సిబ్బంది రెండు టీంలుగా విడిపోవాలన్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPUR

S.O.P. No. 14/2024

Between :
1) Chilukuri Vedavalli W/o. Late Chilukuri Narasu Babu 2) Chilukuri Vijendra S/o. Late Chilukuri Narasu Babu 3) Chilukuri Sudheendra S/o. Late Chilukuri Narasu Babu. All are R/at D.No. 1-1-336-24, Vivek Nagar, Chikkadapalli, Hyderabad. ...Petitioners

and

Nil ... Respondents

ప్రకటన

పై నెంబరు కేసులో లేట్ సి. భీమసేన రావ్ గారి భార్య సి. సరోజిని చనిపోయినందు వలన ఆమెకు రావలసిన బ్యాంకులలో క్రింద కనబరచిన దరావ్తుల మొత్తము తీసుకొనుటకు పై కోర్టులో అర్జీదారులు వారసత్వపు సర్టిఫికెట్ కొరకు అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 24-01-2025వ తేది ఉదయం 10-30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారుల పరంగా తీర్మానించెదరని తెల్పడమైనది.

SCHEDULE

1) An Amount of Rs. 38,320/- is deposited on 28-07-2008 in Andhra Bank (Now Union Bank of India), District Court Branch, Anantapuramu. **2)** An Amount of Rs. 8,140/- is deposited on 19-06-2009 in Indian Overseas Bank, Ashok Nagar, Anantapuramu. **3)** An Amount of Rs. 1,40,891/- is deposited on 15-12-2010 in Indian Overseas Bank, Ashok Nagar, Anantapuramu. **4)** An Amount of Rs. 13,43,528/- is deposited on 19-02-2016 in Andhra Bank (Now Union Bank of India), Ram Nagar Branch, Anantapuramu. **In total an amount of Rs. 15,30,879/- is lying in fixed deposits in the above said banks.**

(By order of the court)

భాస్కర్ రవి ప్రసాదు, బి. నారాయణప్ప
అడ్వకేట్స్, అనంతపురము. సెల్ : 9849663288

జెండర్ ఈక్వాలిటీ





ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

ఇంటింటా లక్ష్మీకళ

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పది హేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లి నట్లే. అయితే కథ అక్కడితో ముగిసి పోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏయస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు.

ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడ బిడ్డను ఎలా బతికించుకోవాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మీ యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మీ యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మీ యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మీ యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మీ యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్, సాక్షి ప్రతినిధి కరీంనగర్

సమాజ హితం కోసం...

ప్రకృతికి దగ్గరగా



డాక్టర్ చెన్నమనేని పద్మ



పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని అంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్థాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.





పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో కోర్సు చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సహజ సిద్ధంగా...

ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ, విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త










● నగధగలు

ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!



ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

- ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.
- నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.
- ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.
- రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.



జియా నస్రీన్
జెమాలజిస్ట్

సోషల్ మీడియా

బామ్మ కోసం... ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!





బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటే గానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్ల నీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

వంటిల్లు

హెల్దీ లంచ్ బాక్స్

స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.

పనీర్ బటర్ మసాలా



కావలసినవి: పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; ఉల్లిపాయ ముక్కలు – ముప్పావు కప్పు; టొమాటో ముక్కలు– కప్పు; వెల్లుల్లి రేకలు– 4; అల్లం తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2; జీడిపప్పు– పది పలుకులు; పాలు– అర కప్పు; మీగడ – పావు కప్పు; కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు – టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; వెన్న – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తరుగు– 3 టేబుల్ స్పూన్‌లు.

పోపు కోసం... నూనె – టేబుల్ స్పూన్; యాలకులు – 2; లవంగం – 1; దాల్చిన చెక్క – అంగుళం ముక్క;

తయారీ: ● పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. ● బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

పీస్ పులావ్



కావలసినవి: బాసుమతి బియ్యం – కప్పు; పచ్చి బఠాణీ– పావు కప్పు; నీరు – 3 కప్పులు; బిర్యానీ ఆకు – ఒకటి; యాలక్కాయ – 1; లవంగం – 1; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నిమ్మరసం – అర టీ స్పూన్.

పోపు కోసం... నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి– 1 (నిలువుగా చీరాలి); షాజీరా– టీ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. ● నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

గమనిక: ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.